
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :
కొత్తగూడ గార్ల / కురవి దంతాలపల్లి పెద్దవంగర
గంగారం బయ్యారం చిన్నగూడూరు నెల్లికుదురు
కేసముద్రం మరిపెడ నర్సింహులపేట ఇనుగుర్తి

TELTEL/2022/83842
PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
గురువారం 05, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :173 | పేజీలు :4 | వెల. 3/-



- మరమ్మత్తుల పేరిట సరఫరా నిలిపివేత
- ప్రతి నిత్యం 2 నుంచి నాలుగు గంటలు కటింగ్
- పాత రోజులు తీసుకొచ్చిన కాంగ్రెస్
- విద్యుత్ అధికారులపై వినియోగదారుల ఆగ్రహం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


2

# కోతలే.. కోతలు..!

## కేసముద్రం మండలంలో అప్రకటిత కరెంట్ కోతలు

కోతలు లేని విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు కేసముద్రం మండలంలో కాగితాలకే పరిమితమవుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో గత కొన్ని రోజులుగా మరమ్మతుల పేరిట విద్యుత్ శాఖ అధికారులు విధిస్తున్న కోతలు వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. నిత్యం రెండు నుండి నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో అటు రైతులు, ఇటు సామాన్య ప్రజలు విద్యుత్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నెలలో సుమారు 10 రోజులకు పైగా మరమ్మతుల పేరిట గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తున్నారు. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలోని పాత రోజులు మళ్ళీ గుర్తొస్తున్నాయని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్ల కాలంలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అప్రకటిత కోతలు పెరిగిపోయాయని వారు విమర్శిస్తున్నారు. ఓ వైపు అధికారికంగా మరమ్మతులని చెబుతూనే, మరోవైపు అనధికారికంగా గంటల తరబడి సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ అప్రకటిత కోతల ప్రభావం చిరు వ్యాపారులపై తీవ్రంగా పడుతోంది. మండల కేంద్రంలోని వెల్డింగ్ దుకాణాలు, మోటార్ వైండింగ్ షాపులు, జిరాక్స్ సెంటర్లు విద్యుత్ లేక గంటల కొద్దీ ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పనులన్నీ నిలిచిపోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని, కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ స్థితి నెలకొందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కోసం విద్యుత్‌పైనే ఆధారపడే అన్నదాతలు సైతం ఈ కోతలతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

— కేసముద్రం, ప్రభాత గమనం



## ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ

- రేషన్ కార్డుదారులకు ఊరట
- వేసవి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

04

## మావోయిస్టు అగ్రనేత
# గణపతి లొంగుబాటు

- ఢిల్లీలో పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రచారం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రెస్ మెట్ ?
- ఇవాళో రేపో స్పష్టత వచ్చే అవకాశం



ప్రభాత గమనం, న్యూఢిల్లీ :

దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతి ఢిల్లీలో లొంగిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన పోలీసుల అదుపులో ఉన్నారని ఢిల్లీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయనను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని ప్రచారం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న తరుణంలో ఈ లొంగుబాటు ప్రాధాన్యత సంతరించుకుంది.

04

## విధుల్లో నిర్లక్ష్యం
# వహిస్తే చర్యలే

- పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి...
- జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి
- కస్తూరిబా గాంధీ విద్యాలయంలో కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మిక తనిఖీ...

—వివరాలు3వ పేజీలో..

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక




- కేసముద్రం మండలంలో కరెంట్ కోతలు
- మరమ్మత్తుల పేరిట సరఫరా నిలిపివేత
- ప్రతి నిత్యం 2 నుంచి నాలుగు గంటలు కటింగ్
- పాత రోజులు తీసుకొచ్చిన కాంగ్రెస్
- విద్యుత్ అధికారులపై వినియోగదారుల ఆగ్రహం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

కేసముద్రం, మార్చి 4(ప్రభాత గమనం): కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ ఒట్టివేనని తేలిపోతున్నాయి. చెప్పేదానికి.. వాస్తవ పరిస్థితులకు చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో మరమ్మతుల పేరిట విద్యుత్‌శాఖ అధికారులు కోతలు విధిస్తున్నారు. దీంతో ప్రజలతోపాటు రైతులు విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. ఉమ్మడి ఏపీ పాలనలో నాటి కరెంట్ కోతలు.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మళ్లా చూస్తున్నామని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మరమ్మతుల పేరిట నెలలో సుమారు 10 రోజులకుపైగా గంట నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలతోపాటు చిరు వ్యాపారులు, గృహిణులు విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే కరెంట్ కోతలు తప్పవని, కరెంట్ వైర్లపై బట్టలు ఆరేసుకునే పరిస్థితి వస్తుందని గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్న మాటలు ప్రస్తుతం వారి పాలనలో అదే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. 2014 రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ సమస్యపై దృష్టి సారించారు. విద్యుత్‌శాఖలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టి రైతులకు, ప్రజలకు, చిరువ్యాపారులకు, పరిశ్రమలకు ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తకుండా నిరంతర విద్యుత్‌ను అందించారు. గత కాంగ్రెస్ ముఖ్యమంత్రి అన్న మాటలు తిప్పి కొడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెప్పపాటు కూడా విద్యుత్ నిలిచిపోకుండా చర్యలు తీసుకొని సీమాంధ్రపాలకులు చేసిన ఆరోపణలకు, నిరంతర విద్యుత్ అందించి కేసీఆర్ దీటైనా సమాధానం ఇచ్చారు. గత పదేండ్ల కాలంలో అన్నివర్గాల ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించి, కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ విద్యుత్ వ్యవస్థను తీర్చిదిద్దారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓ వైపు మరమ్మతుల పేరిట మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పాటు, అనధికారికంగా రోజులో మరో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడంతో ప్రజలు పాత రోజులను గుర్తుచేసుకుంటున్నారు.

## - చిరు వ్యాపారుల ఉపాధిపై దెబ్బ..

విద్యుత్‌శాఖ విధిస్తున్న అప్రకటిత కరెంట్ కోతలతో చిరువ్యాపారుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతున్నది. మండల కేంద్రంలో వెల్డింగ్ దుకాణాలు, మోటర్‌వైండింగ్ దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు కరెంట్‌పైనే ఆధారపడి నడిచే వ్యాపారాలపై కరెంట్ కోతల ప్రభావం తీవ్రంగా ఉంటున్నది. మరమ్మతుల పేరిట గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిపి వేడయంతో వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గత పదేండ్ల కాలంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురు కాలేదని వ్యాపారులు అంటున్నారు. పల్లె ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది.గ్రామాల్లో కరెంట్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి లో పల్లె వాసులున్నారు...

## - ఇన్వర్టర్లకు పెరిగిన గిరాకీ..

విద్యుత్ అప్రకటిత కోతల నుంచి వ్యాపారులతోపాటు ప్రజలు ఉపశమనం పొందడానికి ఇన్వర్టర్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇన్వర్టర్లకి గిరాకీ బాగా పెరిగిపోయింది. విధిలేని పరిస్థితుల్లో ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి ఇన్వర్టర్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఎక్కడ చూసిన ఇన్వర్టర్ల దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం అప్రకటిత విద్యుత్ కోతలే అంటున్నారు స్థానిక మండల ప్రజలు..

## - మరమ్మతుల పేరుతో కోతలు..

మరమ్మతుల పేరిట నెలలో 11 రోజులకు పైగా మండలంలో రెండు గంటల నుంచి మూడు నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా విద్యుత్‌శాఖ అధికారులు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి ఒక్కొసారి 9గంటల వరకు, 10 నుంచి 12 గంటల వరకు మరోసారి, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ముఖ్యంగా ఉద్యోగస్తులు, గృహిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ఇంట్లో కుక్కర్లతో పాటు తదితర వాటిని వినియోగించుకుంటారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నెలలో 11 రోజుల పాటు ఉదయం 7:30 గంటల నుంచి 10గంటల వరకు, 11నుంచి 12గంటల వరకు, 3నుంచి 5గంటల వరకు మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మార్చి మూడవ తారీఖున ఉదయం నుంచి గంట వచ్చుడు గంట పోయే పరిస్థితి ఉంది. మరమ్మతుల పేరుతో అప్రకటిత కోతలు విద్యుత్‌శాఖ అధికారులు విధించారు. ఫిబ్రవరి, మార్చి మొదటలో ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయి అప్పటి పరిస్థితి ఎంటో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో సారి రోజులో రెండు ప్రాంతాల్లో రెండు సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్ కోతలు భరించలేక ప్రజలు ఇన్వర్టర్లు కొనుగోలు చేసి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 26నెలల కాలంలో మళ్లీ ప్రజలకు, చిరు వ్యాపారులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఎక్కువ కోతలు లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉక్కపోతతో ఉండలేకపోతున్నాం : శశికుమార్



ప్రతి రోజు కరెంట్ కోతలు విధిస్తున్నారు. దీంతో చిన్న పిల్లలు మహిళలు ఇంట్లో ఉండలేక పోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంట్ ఒక రోజు కూడా కట్ కాలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎందుకు కరెంట్ కోతలు విధిస్తున్నారు. ప్రజాపాలన లేక ప్రజా వ్యతిరేకుల పాలనా. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ కోతలు నిలువరించాలి.

## పూటపూటకు కరెంట్ పోతుంది : మంద ప్రవీణ్



పూటపూటకు కరెంట్ పోతుంది. ఎండలు విపరీతంగా పెరిగాయి. ఇంట్లో కరెంట్ లేక చాలా అవస్థలు పడుతున్నాం.బిల్లులు బరాబర్ అడుగుతారు కానీ మరి కోతలు ఎందుకు విధిస్తారు. ఈ కరెంట్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నాం.

# ఎర్రగట్టు వెంకన్నన స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

## ఉత్సవ కమిటీకి సన్మానం

వరంగల్ బ్యూరో ప్రభాత గమనం ఫిబ్రవరి 4,
శ్రీశ్రీ శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజు శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారులు వేదాంతం పార్థసారదాచార్యులు ఆరుట్ల శ్రీధరాచార్యులు, శ్రీనాథచార్యులు, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన ఆశీర్వదించారు.ఎమ్మెల్యే గండ దీపం లో నూనె పోసి గండాలు పోవాలని స్వామి ని వేడుకున్నారు. అనంతరం కార్యకర్తలు,ఈ. ఓ వెంకట్రావు,చైర్మన్ మార్క రాజు, ఆలయ డైరెక్టర్లు ఎమ్మెల్యేలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నిమిషంలో నూతన చైర్మన్ డైరెక్టర్లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మార్క రాజు, డైరెక్టర్లు చింతల రమేష్, శాగంటి సదానందం,తోట శ్రీనివాస్, సంగాల సుమన్, పి. జితేందర్, ప్రత్యేక ఆహ్వా



నితులు జరిగే రమ్యకృష్ణరాజు జన్ను సారయ్య, గోపరాజు కనక స్వామి, రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 6 నుండి 15 వరకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

**ప్రభాత గమనం, హైదరాబాద్:**
రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా మార్చి 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు 10 రోజుల పాటు రాష్ట్రవ్యాప్త ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటీ సంజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అయ్యే ఖర్చును గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్స్ లేదా ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల నుండి భరించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ జరిగే పనులను పర్యవేక్షించడానికి హెచ్‌ఓడీ స్థాయిలో నోడల్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యాలయాలను రాష్ట్ర స్థాయిలో సన్మానించడం జరుగుతుంది. మార్చి 6 న ఉమ్మడి జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అధ్యక్షతన సన్నాహక సమావేశం, కార్యాలయాల శుభ్రత చేపట్టనున్నారు. 7,8 తేదీల్లో పాఠశాలలు, అంగన్‌వాడీలు, బస్టాండ్లు వంటి బహిరంగ ప్రదేశాల శుభ్రత, ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణపై ప్రచారం చేయనున్నారు. 9, 10 తేదీల్లో ఈ–వేస్ట్ సేకరణ, డ్రైనేజీల పూడికతీత, బ్లీచింగ్, సున్నం చల్లడం, 12 వ తేదీన కొత్తగా ఎన్నికైన సర్పంచులకు జిల్లా స్థాయిలో ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. 13 వ తేదీన ఫ్రైడేను 'డ్రై డే'గా పాటించడం, చెరువులు, కుంటల శుభ్రత, 15 వ తేదీన సఫాయి కార్మికులకు సన్మానం, వారికి పీపీఈ కిట్ల పంపిణీ, ఆరోగ్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలే

- పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి...
- జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి
- కస్తూరిబా గాంధీ విద్యాలయంలో కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మిక తనిఖీ...



కేసముద్రం మార్చి 4(ప్రభాత గమనం): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ, అన్ని విద్యా సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో ప్రత్యేక అధికారులు సంబంధిత సిబ్బంది ముందుకు సాగాలని, పిల్లలకు అందించే సౌకర్యాలలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని (కేజీబీవీ) కస్తూరిబా గాంధీ విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ గది, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలు, డైట్ మెనూ, తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలని, పక్కాగా డైట్ మెనూ ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం స్నాక్స్ అందించాలని, తద్వారా పిల్లలు మంచి వాతావరణంలో విద్యను కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థినిని గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు.ప్రత్యేక అధికారులు ఇప్పటికే వారికి కేటాయించిన విద్యా సంస్థలలో తనిఖీలు నిర్వహించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించడం జరుగుతుందని, ప్రతిరోజు ఉదయం సాయంత్రం వసతిగృహాలు, విద్యా సంస్థల నివేదికలు సమర్పించాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలలో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, స్పెషల్ అధికారిణి సోమలక్ష్మి పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగి వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజేశ్వర్, స్థానిక తహసీల్దార్ వివేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భక్తి, ఐక్యతకు ప్రతీక కొమ్మాల జాతర

- భక్తులు స్వామి వారిని ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలి
- ప్రభ బండ్ల ఊరేగింపులో అప్రమత్తంగా ఉండాలి
- గొడవలకు అస్కారం ఇవ్వొద్దు.. స్నేహభావంతో మెలగాలి
- భక్తులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపు



వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం: నర్సంపేట నియోజకవర్గంలో భక్తి, ఐక్యతలకు ప్రతీకగా నిలిచే కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భక్తులకు మరియు నాయకులకు కీలక సందేశాన్ని ఇచ్చారు. వివిధ గ్రామాల నుండి ప్రభ బండ్లతో బయలుదేరే భక్తులు క్షేమంగా వెళ్లి, లాభంగా తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. భక్తి మార్గంలో అడుగులు వేయాలే తప్ప, గొడవల దారిలో వెళ్లకూడదని ఆయన హితవు పలికారు. జాతర అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయం మరియు గ్రామ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒక గ్రామం నుండి మరో గ్రామం వరకు వచ్చే ప్రభ బండ్ల మధ్య పరస్పర గౌరవం ఉండాలని, ఎలాంటి కక్షలు, వివాదాలు లేదా మాటల పట్టింపులు చోటుచేసుకోకుండా చూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత అత్యంత నియంత్రణతో ఉండి పెద్దల మాట వినాలని, ఉత్సాహం ఉన్మాదంగా మారకుండా జాగ్రత్త పడాలని ఎమ్మెల్యే సూచించారు. చిన్నపాటి అపార్థాలు పెద్ద గొడవలకు దారి తీసే ప్రమాదం ఉన్నందున, ప్రతి ఒక్కరూ సహనం మరియు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. భక్తి భావంతో స్వామి సన్నిధికి చేరే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని, తమ కుటుంబాల కోసం మరియు గ్రామాల శ్రేయస్సు కోసం ప్రార్థించాలని తెలిపారు. మన గ్రామ గౌరవం మన చేతుల్లోనే ఉంటుందని గుర్తు చేస్తూ, ఐక్యతను చాటుకుంటేనే జాతర మహిమ మరింత వెలుగొందుతుందని ఆయన వివరించారు. ప్రతి ప్రభ బండి సురక్షితంగా వెళ్లి రావాలని, కొమ్మాల జాతర భక్తుల ఆనందోత్సాహాలకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. మరోవైపు నర్సంపేట నియోజకవర్గంలో హోలీ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలతో కలిసి రంగుల కేళిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణమంతా నినాదాలు మరియు హర్షధ్వానాల మధ్య పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రంగుల పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మహబూబాబాద్ మార్చి 4(ప్రభాత గమనం): బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల గుమ్ముడూరు, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కంకర బోర్డులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వసతి గృహంలోని పరిసరాలను పరిశీలించి, నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. రానున్న పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.పిల్లలతో స్వయంగా మాట్లాడి వారి విద్యా సమర్థ్యాలను ఆయన పరిశీలించారు.



## బీఆర్ఎస్ ప్రభబండికి అగ్ని ప్రమాదం

వరంగల్ బ్యూరో/గీసుగొండ ప్రభాత గమనం : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కొమ్మాల జాతర సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రభ బండికి బాణాసంచా కాలుస్తున్న సమయంలో చెలరేగిన మంటలు ప్రభ బండిపై ఉన్న అలంకరణ సామగ్రికి అంటుకోవడంతో కాసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జాతర కోసం ప్రత్యేకంగా అలంకరించి తీసుకువచ్చిన ప్రభ బండి కొమ్మాల స్టేజ్ నుంచి ఊరేగింపుగా జాతర ప్రాంగణానికి చేరుకుంది. ఈ సమయంలో అక్కడ బాణాసంచా కాలుస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పిన మంటలు ప్రభ బండిపై ఉన్న ఫ్లెక్సీలు, జెండాలు, లైటింగ్ వైర్లు, ఇతర అలంకరణ వస్తువులకు అంటుకున్నాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ప్రభ బండిపై అమర్చిన ఫర్నీచర్, జెండాలు, విద్యుత్ లైటింగ్ సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో అక్కడ ఉన్న భక్తులు, స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే వెంటనే అప్రమత్తమైన స్థానికులు, నిర్వాహకులు కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. జాతరల్లో బాణాసంచా కాల్చేటప్పుడు నిర్వాహకులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు.



గురువారం
05.03.2026
www.prabhatagamanam.com

PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

## మావోయిస్టు అగ్రనేత

# గణపతి లొంగుబాటు?

- ఢిల్లీలో పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రచారం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రెస్ మీట్ ?
- ఇవాళో రేపో స్పష్టత వచ్చే అవకాశం



**ప్రభాత గమనం, న్యూఢిల్లీ :**

దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతి ఢిల్లీలో లొంగిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన పోలీసుల అదుపులో ఉన్నారని ఢిల్లీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయనను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని ప్రచారం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న తరుణంలో ఈ లొంగుబాటు ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ ఐజీ బి సుమతి ప్రస్తుతం ఢిల్లీలోనే ఉండటం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత వారమే మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, దామోదర్, నర్సింహారెడ్డి వంటి వారు లొంగిపోయారు. గణపతిని కూడా జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు తెలంగాణ పోలీసులు చేసిన చర్చలు సఫలమైనట్లు భావిస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన గణపతిపై అనేక రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. గత కొంత కాలంగా గణపతి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందుతోంది. ఆయనకు మెరుగైన వైద్యం అందజేయాలన్న కుటుంబ సభ్యుల విన్నపం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్యాకేజీల పట్ల కూడా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ గణపతి లొంగుబాటు నిజమైతే భారత మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రేషన్ కార్డుదారులకు ఊరట

- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వేసవి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

**ప్రభాత గమనం, న్యూఢిల్లీ :**

రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మూడు నెలల కోటాను ఏప్రిల్ నెలలోనే లబ్ధిదారులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ప్రస్తుతం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రతి లబ్ధిదారునికి నెలకు ఆరు కిలోల చొప్పున ప్రభుత్వం బియ్యం అందజేస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఫుడ్ సెక్యూరిటీ కార్డుల సంఖ్య పెరగడంతో కోటికి పైగా కార్డుదారులు ఉన్నారు. కేంద్రం సూచనల మేరకు మూడు నెలల కోటాకు సరిపడా బియ్యం నిల్వలు, పంపిణీ సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు డీలర్లు, హమాలీలకు సమయం ఆదా అవుతుంది. అయితే గతంలో ఇలా పంపిణీ చేసిన సమయంలో రేషన్ డీలర్లు నిల్వ సామర్థ్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లబ్ధిదారులు మూడు నెలల కోటా కోసం మూడుసార్లు వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. సర్వర్ సమస్యల కారణంగా ఒక్కో కార్డుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించి పంపిణీ సజావుగా సాగేలా చూడాలి.

**ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం**

## మిస్సైల్ దాడి.. తెలంగాణవాసికి తీవ్రగాయాలు

- బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లగా ఘటన


అక్షర దర్బార్, ఎల్లారెడ్డిపేట: ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ సెగలు గల్ఫ్ దేశాల్లోని భారతీయులను వణికిస్తున్నాయి. తాజాగా ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడిలో తెలంగాణకు చెందిన ఓ వలస కార్మికుడు తీవ్రంగా గాయపడటం కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నందెల్లి రాజేశ్వర్‌రావు నాలుగేళ్లుగా ఉపాధి కోసం అబుదాబిలో ఉంటున్నాడు. అక్కడ విమానాశ్రయంలో క్లీనింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడి ప్రభావంతో ఎయిర్‌పోర్ట్ అద్దాలు ఒక్కసారిగా పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో గాజు పెంకులు రాజేశ్వర్‌రావు ఛాతి, కుడి చేతిలోకి బలంగా దూసుకుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సహచర కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాజేశ్వర్‌రావు తన గదికి చేరుకున్నట్లు సమాచారం.

## అంగరంగ వైభవంగా

# విరోష్ వెడ్డింగ్ రిసెప్షన్

**ప్రభాత గమనం, హైదరాబాద్:**

విజయ్ దేవరకొండ – రష్మికల వెడ్డింగ్ రిసెప్షన్ బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో అత్యంత వైభవంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా విజయ్ పంచెకట్టులో, రష్మిక చీరలో వచ్చి అతిథులను ఆకట్టుకున్నారు. ఈ వేడుకతో తమ సెలబ్రేషన్స్ ముగిశాయని 'విరోష్' జంట ప్రకటించింది. చిరంజీవి, అక్కినేని నాగార్జున–అమల, వెంకటేశ్, రామ్ చరణ్–ఉపాసన, అల్లు అర్జున్, నాగచైతన్య, రవితేజ, నాని వంటి సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.





## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు

అక్షరదర్బార్, హనుమకొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుట్టినరోజును పురస్కరించుకొని హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిమాన నాయకుడు నాగరాజుకు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు, ప్యాడ్స్ అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. వీరి మధ్య ఎమ్మెల్యే నాగరాజు కేక్ కట్ చేశారు. ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. తన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు భద్రకాళి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.

## ముగ్గురిపై వేటు..

ప్రభాత గమనం, మరిపెడ: మరిపెడ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై బుధవారం ఆర్‌సీవో పి.రత్నకుమారి విచారణ చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్ట్ ఉద్యోగి బి.వీరన్న, నైట్‌షిఫ్ట్ ఇన్‌చార్జి బి.రాజేందర్, హౌస్ మాస్టర్, పీటీ జె.ఉపేందర్‌లను సర్వీస్ నుంచి రిమూవల్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగి జె.లక్ష్మణ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. గురుకులంలో లాంగ్ స్టాండింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సైతం బదిలీ చేసేలా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఆర్‌సీవో వెల్లడించారు.

## మాజీ సర్పంచులకు గుడ్ న్యూస్

ప్రభాత గమనం, హైదరాబాద్ : 2023–24 టైడ్ కాంపొనెంట్ కింద విడుదలైన నిధులపై గత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను రికార్డులు పరిశీలించి చెల్లించాలన్న మంత్రి సీతక్క ఆదేశాలతో ఎట్టకేలకు పంచాయతీరాజ్ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీలకు టైడ్ కాంపొనెంట్ కింద రూ.245 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి బేసిక్ అన్‌టైడ్, టైడ్ గ్రాంట్స్ కింద రూ.640.07 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. గత సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1, 2004తో ముగిసిన నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి విడుదలైన టైడ్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉన్న మేరకు మాత్రమే గత సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించాలని సూచించారు. ఈ మేరకు జిల్లాల స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra